క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. పాలజెండా, రెడ్డికాలనీ, బుద్ధభవన్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

17న దేహదారుఢ్య పోటీలు

ఖిలా వరంగల్: ఈనెల 17న వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో విద్యార్థుల దేహదారుఢ్య పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016, సెప్టెంబర్ 1నుంచి 2017, ఆగస్టు 31 మధ్యలో జన్మించి, 4వ తరగతి చదువుతున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 4గంటలలోపు ఆన్‌లైన్‌లో తమ పేర్లను విద్యార్థులు నమోదు చేసుకుని, అన్ని ధ్రువీకరణ పత్రాలతో పోటీల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

రైతు భరోసాకు దరఖాస్తులు

కాజీపేట: ఈనెల 5వ తేదీ వరకు నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందినవారు రైతు భరోసా కోసం సంబంధిత మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, భూమి వివరాలు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను అందజేయాలి. జిల్లాలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు జిల్లాలో 11వేలకు పైగా ఉన్నారు. గతంలో వివరాలు అందించని వారు, తప్పుడు నంబరు ఇచ్చి భరోసా అందని వారు సైతం ఏఈఓలను కలిసి సరైన వివరాలు సమర్పించాలి.

‘కిట్స్’కు బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు



హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ కళాశాలకు బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు లభించింది. ఈమేరకు హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో అవార్డును రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందజేశారు. కిట్స్, వరంగల్ (ఎన్ఎస్ఎస్ క్లబ్), స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ఆధ్వర్యంలో 2024 – 25వ సంవత్సరంలో అధిక రక్తదాన కార్యక్రమాలు నిర్వహించినందుకు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిట్స్ సిబ్బందిని కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కోశాధికారి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ఏఓ డాక్టర్ రమేష్ అభినందించారు.

బాలల అక్రమ రవాణాను అరికట్టాలి


ఖిలా వరంగల్: మానవ, బాలల అక్రమ రవాణా నిర్మూలనపై వరంగల్ ఫోర్ట్ రోడ్డు టాలెంట్ హైస్కూల్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ సుదర్శన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావాలు పెంపొందించుకోవాలని అన్నారు. హక్కులు, బాధ్యతలు, బాల్య వివాహాలు, బాల కార్మికుల, అనాథ పిల్లలు, ఈవ్ టీజింగ్ మొదలగు వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

బీజేపీ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు పాటుపడాలి



కాజీపేట: రానున్న ఎన్నికలో బీజేపీ అభ్యర్థులు గెలిచేలా కార్యకర్తలు ఇప్పటినుంచే బూత్ స్థాయిలో కష్టించి పనిచేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ సూచించారు. పీఎం నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తైన సందర్భంగా కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో కార్యకర్తలు శనివారం సంబురాలు జరుపుకున్నారు. సమావేశంలో పాశికంటి రాజేంద్రప్రసాద్, వలబోజు శ్రీనివాస్, చాంద్‌పాషా, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, మేకల శ్రావణ్ కుమార్, జి.శ్రీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్వేతార్కుడు



కాజీపేట: సంకటహర చతుర్థి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి శనివారం ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో భక్తులు తెచ్చిన నదీ జలాలతో పాటు సప్తవర్ణ అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు అందించిన చక్కరతో అభిషేకం చేశారు. ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ గణపతి హోమం చేయించారు. కార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసాదాల వితరణతో పాటు అన్నదానం చేశారు.

యువ వికాసం.. వాయిదాల పర్వం

- ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ పథకానికి సంబంధించి రుణ లక్ష్యం తక్కువగా ఉండడం, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో ఇప్పట్లో ఈ పథకం పట్టాలపైకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని నిరుద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాయితీపై రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో నిరుద్యోగుల నుంచి రెండు నెలల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించాయి. కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 36వేల దరఖాస్తులు రాగా, 8వేల మందిని మొదటి విడతలో అర్హులుగా ఎంపిక చేశారు. వారిలో వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ నియోజక వర్గాలకు చెందిన నిరుద్యోగులు ఉన్నారు. అర్హులకు జూన్ 2నుంచి రుణ పత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించినా చివరి నిమిషంలో అది వాయిదా పడింది.

నిరాశలో నిరుద్యోగులు

రాజీవ్ యువ వికాస పథకం కింద నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు రుణాలు అందిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు పలుమార్లు ప్రకటించారు. దాంతో ఆశపడిన నిరుద్యోగులు.. పథకం వాయిదాతో ఒక్కసారిగా డీలా పడిపోయారు. కాజీపేట సర్కిల్ పరిధిలోని కాలనీలతో పాటు విలీన గ్రామాల నిరుద్యోగులు రుణాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. రుణాల పంపిణీ వాయిదాల మీద వాయిదాలు పడుతుండడంతో అసలు పంపిణీ జరుగుతుందా అనే మీమాంసలో నిరుద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ పెద్దలు నిజమైన అర్హులను గుర్తించి స్వయం ఉపాధి పథకాల ఏర్పాటుకు చేయూతనందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



బోడగుట్టలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట రూరల్: ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్, బోడగుట్టల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహ నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, నాయకులు మైసారపు సిరిల్‌లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, తమ్మడి మానస, మధు, చిలువేరు విజయభాస్కర్, గరిగె శివ, దువ్వ రాజు, కొమురవెల్లి రమేష్, తిరుపతి, శ్రీనివాస్, పోగుల శ్రీనివాస్, మాతంగి స్వామి, దర్గా రాజ్‌కుమార్, సల్లూరి నాగేశ్వర్‌రావు, కొంకటి శరత్, కాళేశ్వరం రేణుక, మాలతి పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

నయీంనగర్: ప్రజల నిత్య జీవనానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 6వ డివిజన్ లష్కర్ బజార్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీపడేది లేదని అన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నం మధు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తవ్వి.. వదిలేశారు

- మ్యాన్‌హోల్‌గా మారిన గుంతలు
- నెల గడుస్తున్నా పూడ్చని వైనం



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత

కాజీపేట అర్బన్: ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. కాజీపేట మండలం కడిపికొండ గ్రామం నుంచి ఉర్సుగుట్టకు వెళ్లే ఖమ్మం బైపాస్ రోడ్డుపై ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు కోసం గుంతలు తవ్వారు. అనంతరం ఆ గుంతలకు పూడ్చకుండా వదిలేయడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిలో నిత్యం భారీ వాహనాలతో పాటు ద్విచక్రవాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి.

మ్యాన్‌హోల్‌గా మారి..

ఖమ్మం బైపాస్ రోడ్డుపై ఆప్టిక్ ఫైబర్ కేబుల్ కోసం తవ్విన గుంతలు మ్యాన్‌హోల్‌గా మారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. నెల క్రితం తవ్విన గుంతల్లో ఆప్టిక్ ఫైబర్ కేబుల్‌ను అమర్చి గుంతలను పూడ్చడకుండా అలాగే వదిలేశారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం అలుముకుంటోంది. ఈక్రమంలో ఆ గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



తవ్వి పూడ్చకుండా వదిలేసిన గుంత

ఉపాధి పథకానికి నిధులు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

న్యూశాయంపేట: ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రెండువందల రోజుల పనిదినాలు కల్పించాలని భారతీయ కిసాన్ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలు విడనాడి కార్మిక, కర్షక ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పాటుపడకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, బి.భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పదవుల్లో పెరికలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంగని మల్లేశ్వర్

నయీంనగర్: పార్టీ నామినేటెడ్ పదవుల్లో పెరిక కులస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పెరిక కుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) జాతీయ అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ కోరారు. ఎమ్మెల్సీ నియామకాల్లో, మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించి, కామారెడ్డి డిక్లరేషన్ అమలు దిశగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పెరిక కులానికి టీపీసీసీ, దాని అనుబంధ సంఘాలు, రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హనుమకొండ శంకర్‌నగర్ కాలనీ పెప్సీ కార్యాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు నియోజకవర్గాల్లో ఓట్లను ప్రభావితం చేయగలిగే అధిక బలం ఉన్న పెరిక కులానికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడం శోచనీయమని మల్లేశ్వర్ అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీరాం వీరయ్య, గుమ్మళ్ల మల్లికార్జున్, సతీష్‌కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, వీర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కాజీపేట అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం హంటర్‌రోడ్డులోని వెలమ సంక్షేమ భవన్‌లో శనివారం జరిగింది. అధ్యక్షుడిగా నడిపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా పిన్నింటి బాలచందర్‌రావు, తక్కళ్లపల్లి శ్యామ్‌సుందర్‌రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, కార్యదర్శిగా కాకులమర్రి ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా పల్లెపాటి విద్యాసాగర్‌రావు, కోశాధికారిగా సిద్దూరి స్వామిరావు, ఈసీ మెంబర్లుగా పి.రఘుకుమార్, గండ్ర ప్రభాకర్‌రావు, మార్నేని రవీందర్‌రావు, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, చెన్నమనేని జయశ్రీ, గుజ్జ గోపాల్‌రావు, తక్కళ్లపల్లి అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, లింగంపల్లి పాపారావు, పిన్నింటి వెంకటేశ్వర్‌రావు, జలగం రంజిత్‌కుమార్, ఎన్నమనేని శ్రీనివాస్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు.

చేగువేరా జీవితం స్ఫూర్తిదాయకం



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: చేగువేరా జీవితం స్ఫూర్తిదాయకమని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఉద్యమ నేత చేగువేరా 97వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ అర్జెంటీనాలో జన్మించిన చేగువేరా.. వైద్య, ఇంజనీరింగ్, విద్యలను అభ్యసించి, ఆనాడు లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదం దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయ స్ఫూర్తితో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, అభిరామ్ రమేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

మడికొండ: గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. మడికొండ శివారు పెద్దమ్మ ఆలయం వద్ద గట్ల భిక్షపతి షాపులో శనివారం తనిఖీలు చేశారు. అతని వద్ద రూ.3,130 విలువ గల పొగాకు ఉత్పత్తులు లభించగా, అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. గంగాయి, మద్యం, పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తూ తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని యువతకు సూచించారు.

చెరువు మట్టిని అమ్ముకుంటున్నారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



చెరువును పరిశీలిస్తున్న వినయ్‌భాస్కర్

వరంగల్ అర్బన్: భద్రకాళి చెరువులోని మట్టిని కాంగ్రెస్ ప్రజాప్రజానిధులు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. భద్రకాళి చెరువు, భద్రకాళి అమ్మవారిని శనివారం దర్శించుకున్న అనంతరం చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మట్టిని రైతులకు ఉచితంగానే పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మత్స్యకారులు, చిరువ్యాపారుల జీవనోపాధిని కాంగ్రెస్ నాయకులు దూరం చేశారని అన్నారు.

బ్రేక్ డౌన్.. ఆందోళనలో అన్నదాతలు

హసన్‌పర్తి: త్రీఫేస్ విద్యుత్ బ్రేక్ డౌన్‌తో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లోని వ్యవసాయ బావులకు సరఫరా అవుతున్న విద్యుత్ సరఫరాలో పది నిమిషాలకోసారి అంతరాయం ఏర్పడుతోంది. దీంతో బోరు మోటార్లు పాడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా ఇదే దుస్థితి నెలకొందని చెబుతున్నారు. ప్రస్తుతం వరి నారు నాటుకునేందుకు అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఉన్నతాధికారులు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తైక్వాండో సంఘం కార్యదర్శి హఠాన్మరణం



సారంగపాణి (ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్: గుండెపోటుతో వరంగల్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వావిలాల సారంగపాణి (56) శుక్రవారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. అతడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తుండగానే సారంగపాణికి గుండెపోటుకు గురై మృతి చెందారు. వరంగల్ కాశిబుగ్గకు చెందిన సారంగపాణి అనేక ఏళ్లు హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన శిక్షణలో అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారు. సారంగపాణి అంత్యక్రియలు కాశిబుగ్గలోని శ్మశానవాటికలో శనివారం నిర్వహించారు. సారంగపాణికి భార్య విజయ, కుమారుడు నరసింహ, కూతురు సంకీర్తన ఉన్నారు. సారంగపాణి మృతిపై వివిధ క్రీడా సంఘాలు బాధ్యులు, క్రీడాకారులు సంతాపం తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



ఎంజీఎం: అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు



ఖిలా వరంగల్: మెడికేర్ జనరల్ ఆస్పత్రిలో..



మెడికవర్‌లో రక్తదాన శిబిరం

ఎంజీఎం: రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడుదామని ఏవీవీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో రక్తదానంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం.. మానవత్వానికి, సామాజిక సేవకు ఒక్క చిహ్నమన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి హాని ఉండదని, కొత్తసెల్స్ ఉత్పత్తి అయి ఉత్సాహంగా ఉంటారని వివరించారు. ప్రతీ మూడు నెలలకోమారు రక్తదానం చేయవచ్చని, కనీసం సంవత్సరానికి ఒక్కసారైనా పెళ్లిరోజు, పుట్టిన రోజుల్లో రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు నవ్యశ్రీ, మిన్ను, దేవిశ్రీప్రసాద్, సాత్విక్, సాకేత్, చిరంజీవి, హేమంత్, వరుణ్ తేజ్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ఖిలా వరంగల్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మెడికేర్ జనరల్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గాదె చిన్నప్పరెడ్డి కోరారు. వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఉర్సు గుట్ట సమీపంలోని మెడికేర్ జనరల్ ఆస్పత్రిలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు, గుడ్ సామర్టిన్ క్లబ్ చైర్మన్ గాదె స్వరూప్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మెడికేర్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జ్ నరేందర్‌రెడ్డి నేతృత్వంలో రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. మెడికేర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు 102 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, ఆరోగ్య రెడ్డి, నిర్మల, అర్జున్‌రెడ్డి, అనిల్, ఫెరోజ్, ఇబ్బు విజయ్, జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మెడికవర్‌లో మెగా రక్తదాన శిబిరం

కాజీపేట అర్బన్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మదర్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్ వరంగల్ సౌజన్యంతో హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ నరసింహారావు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడమంటే ప్రాణదానం చేయడంతో సమానమని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు షఫీ, సునీల్‌కుమార్, వినోద్, ఏజీఎం హరినాథ్, మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’లో రెసోమెడికాన్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హన్మకొండ: నీట్ –2025 ఫలితాల్లో హనుమకొండలోని రెసోమెడికాన్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి తెలిపారు. గత సంవత్సరం లాగే ఈసారి కూడా అధిక మార్కులు సాధించి, ప్రతిష్టాత్మక వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందబోతున్నారని అన్నారు. బి.పూజ 531మార్కులు, ఆర్.పల్లవి 505, ఆర్.ఇక్షావర్ 492, అస్మాత్తున్నీసా 471 మార్కులు సాధించారని వివరించారు. వరంగల్‌లో బైపీసీ, నీట్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెసోమెడికాన్ బ్రాంచ్ నుంచి 80 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను చైర్మన్‌తో పాటు అధ్యాపకులు, తదితరులు అభినందించారు.

‘అవంతి’ పూర్వ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

కాజీపేట అర్బన్: నీట్ ఫలితాల్లో హంటర్‌రోడ్డులోని అవంతి హైస్కూల్ పూర్వ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. నీట్‌లో టి.సిరి ఆల్ ఇండియా 232వ ర్యాంకు, ఈఏపీసెట్‌లో ఎం.శ్రీజ 2,156వ ర్యాంకు సాధించారని అన్నారు. ఈమేరకు హంటర్‌రోడ్డులోని స్కూల్ ఆవరణలో వారిని శనివారం అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నర్సరీ నుంచి పదో తరగతి వరకు తమ పాఠశాలలో విద్యనభ్యసించిన సిరి, శ్రీజలు నీట్‌లో ప్రతిభ కనబరచడం తమకెంతో గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతారాణి, డైరెక్టర్లు అశోక్‌రెడ్డి, అనిత తదితరులు పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్ బాధితుల ధర్నా



అక్షర చిట్స్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

కాజీపేట అర్బన్: ‘మా డబ్బులు మాకు ఇప్పించండి’ అంటూ అక్షర చిట్‌ఫండ్స్ అండ్ అక్షర టౌన్‌షిప్ బాధితులు కోరారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని అక్షర చిట్‌ఫండ్స్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. చిట్టీల డబ్బును తిరిగి చెల్లించకుండా తమను అక్షర యాజమాన్యం తిప్పించుకుంటోందని తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాధితులు వాపోయారు. చిట్‌ఫండ్ యజమాని పేరాల శ్రీనివాసరావు తప్పించుకుని తిరుగుతున్నాడని విమర్శించారు. జిల్లా చిట్స్ కార్యాలయంలో, పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు వినతులు అందజేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

సంక్షిప్తంగా

అడిషనల్ డీసీపీని కలిసిన హడుప్సా నేతలు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ బోనాల కిషన్‌ను హనుమకొండ డిస్ట్రిక్ యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ (హడుప్సా) నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హడుప్సా అధ్యక్షుడు వర్ధమాన్ జనార్దన్, సలహాదారు టి.బుచ్చిబాబు, నాయకులు రామారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోనె సంచులను తొలగించాలి

ఖిలా వరంగల్: తిలక్ రోడ్డు నుంచి శ్మశాన వాటికకు వెళ్లే అంతర్గత దారిపై పేరుకుపోయిన గోనె సంచులను వెంటనే తొలగించాలని తిలక్ రోడ్డు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు లక్కిరెడ్డి పూర్ణేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీనగర్ తిలక్ రోడ్డు పక్కన అంతర్గత సీసీ రోడ్డుపై ఇరువైపులా పేరుకుపోయిన గోనె సంచులు, చెత్తాదారాన్ని స్థానికులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు వేసి 25రోజులు దాటిందని, రోడ్డుపై వేసిన గోనె సంచులను పక్కనే పడేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీనివాస్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట: ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్‌కలాం సేవారత్న, సాహిత్య రత్న, ఉత్తమ సర్పంచ్, విద్యారత్న, ఉమెన్ లీడర్‌షిప్ అవార్డులకు బహుజన సాహిత్య అకాడమీ ఉమ్మడి వరంగల్ కమిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెలక్షన్ కమిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్ శనివారం తెలిపారు. మరిన్ని వివరాలకు 99899 496532, 73864 09653 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.